ఈనాడు
శ్రీ సత్యసాయి
ఆదివారం సెప్టెంబరు 29, 2024

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: మంత్రి

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో పురపాలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, పురపాలక సిబ్బంది హాజరయ్యారు. పట్టణాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల గురించి అధికారులకు సూచనలిచ్చారు. తుంపర్తి కాలనీలో నిర్వహించిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న గృహాలను మంత్రి ప్రారంభించారు. మార్చిలోగా గృహాలు పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరవుతాయని వివరించారు. ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, డోలా రాజారెడ్డి, గిర్రాజు నగేష్, కోటి సూర్యప్రకాష్ బాబు, తదితర భాజపా నాయకులు పాల్గొన్నారు.

★ మంత్రి కార్యాలయంలో భాజపా నాయకుడు జింకా రామాంజనేయులు సహకారంతో 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం పురపాలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మల్లికార్జున, పురపాలక సిబ్బంది హాజరయ్యారు.


పారిశుద్ధ్య కార్మికుడి కాళ్లు కడుగుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

విచారణ వేగవంతమైతేనే బాధితులకు న్యాయం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి


హాజరైన న్యాయాధికారులు

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: కేసుల విచారణలో వేగం పెరగాలి. శిక్షలు పడేలా వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కోర్టులో శనివారం న్యాయాధికారులకు నూతన చట్టాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నూతన చట్టాలను పరిగణలోకి తీసుకొని కేసుల విచారణను వేగవంతం చేయాలన్నారు. పోలీసులు కోర్టుకు అందజేయాల్సిన నివేదికలను సకాలంలో పంపేలా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. అనంతరం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్, రీసోర్స్ పర్సన్ హజరత్‌రావులు నూతన చట్టాలు, పోక్సో చట్టం, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, న్యాయమూర్తులు సత్యవాణి, రాజ్యలక్ష్మి, శోభారాణి, హరిత, సాధుబాబు, శివప్రసాద్ యాదవ్, శంకర్‌రావు, శివశంకర్, సుజిన్‌కుమార్, ప్రతిభ పాల్గొన్నారు.

న్యాయవాదులకు అవగాహన ముఖ్యం

జూనియర్ న్యాయవాదులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. న్యాయమూర్తి జిల్లాలో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. సొంత ఊరికి వచ్చినంత ఆనందంగా ఉందన్నారు. ఇక్కడే ఎస్కేయూ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో పట్టభద్రుడై హైకోర్టు నుంచి జిల్లా పరిపాలనా న్యాయమూర్తిగా రావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ బార్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, నారాయణరెడ్డి, సురేష్, వెంకట్రాముడు, దస్తగిరి పాల్గొన్నారు.

మాయలో దించుతారు... నట్టేట ముంచుతారు

● సైబర్ నేరగాళ్ల వలలో విలవిల ● యువతా.. తస్మాత్ జాగ్రత్త!



హాయ్.. అని ఆకర్షించి..

ఇటీవల అనంత నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి వాట్సప్‌కు గుర్తు తెలియని నంబరు నుంచి 'హాయ్' అని మెసేజ్ వచ్చింది. హలో అని పరిచయం చేసుకున్నాడు. వెంటనే ఓ యువతి ఆకర్షణీయ ఫొటోలను పంపింది. నగ్నంగా చూడాలంటే వీడియోకాల్ చేయమని కోరింది. బలహీన క్షణంలో అతడు వీడియో కాల్ చేయగానే అవతల నగ్నంగా యువతి వీడియోలో కనిపించింది. వెంటనే కాల్‌కట్ అయింది. మూడు నిమిషాలు నగ్నంగా ఉన్న యువతి వీడియోను... ఇవతలి వ్యక్తి చూసినట్లు మార్ఫింగ్ చేసి.. తిరిగి సదరు ఉద్యోగికి వచ్చింది. ఇదే వీడియోను మీ మిత్రులు, కుటుంబ సభ్యులకు పంపుతామని, డబ్బు ఇస్తే ఆపేస్తామని చాట్ చేశారు. భయపడిన బాధితుడు రూ.లక్ష వరకు సైబర్ నేరగాళ్లు పంపిన ఖాతాలకు డబ్బు జమ చేశాడు.



ప్రేమ.. పెళ్లి వరకు వెళ్లి..

గుంతకల్లుకు చెందిన యువతికి ఓ డేటింగ్ యాప్‌లో శాండీ పేరుతో నకిలీ యూజర్ ప్రొఫైల్‌తో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగినని, యాప్ డెవలపర్ అని పరిచయం చేసుకున్నాడు. అతడి ప్రొఫైల్ చూసి సదరు యువతి అంగీకరించింది. కొన్ని రోజులపాటు సరదాగా మాట్లాడాడు. తర్వాత ప్రేమిస్తున్నానని, పెండ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ నేరగాడిని యువతి పూర్తిగా నమ్మింది. కొన్నిరోజులకు తన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో ఉన్నారని, డబ్బు అవసరమని, కొంత సర్దితే మళ్లీ పంపిస్తానంటూ నగదు లాగేశాడు. ఇలా రూ.3 లక్షలు దోచుకున్నాడు. చివరకు మెసేజ్‌లు, ఫోన్ చేయడం ఆపేశాడు. యువతి లబోదిబోమంది. పోలీసు కేసు వరకూ వెళ్తే పరువు పోతుందని వెనక్కి తగ్గింది.


అనంత నేరవార్తలు, పుట్టపర్తి, న్యూస్‌టుడే

హాయ్.. అని మొదలవుతుంది ఆ యవ్వారం.. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం.. ఇలా సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త స్నేహాలు పుట్టుకొస్తాయి. ఇంకేం.. ముందు మాటలు.. ముద్దుముచ్చట్లతో కాలం సాగుతుంది. మాటల వెనక మర్మం తెలిసేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. స్నేహం మాటున పన్నాగం మొదలై.. నెమ్మదిగా ఉచ్చులోకి దించే తంతు.. మాయలో పడిన యువకులకు వీడియో చాటింగ్ చేస్తారు.. ఆపై నగ్న వీడియోలు.. తర్వాత వాటిని సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులు.. ఇక అంతే దొరికిన కాడికి దోచుకుంటారు. వలలో చిక్కిన వారు తగిన భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు.

విద్యార్థుల నుంచి వృద్ధులదాకా..

సామాజిక మాధ్యమాల్లో డేటింగ్ యాప్‌లు విపరీతంగా పెరిగిపోయాయి. అందమైన ఫొటోలను డీపీలుగా ఉంచి ఆకర్షిస్తారు. హలో.. హాయ్.. అని సందేశాలు పంపడంతోనే మొదలవుతుంది. ఇప్పటివరకు పురుషులు మాత్రమే బాధితులు కాగా.. మహిళలనూ ఈ ఉచ్చులోకి లాగుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, డేటింగ్ యాప్స్ ..ఇవే మాయగాళ్లకు అసలైన అస్త్రాలు. స్నేహం పేరుతో రిక్వెస్ట్ పంపుతారు. ప్రొఫైల్‌లో అందమైన చిత్రాలు, ఉన్నత కొలువులో ఉన్నట్లు నమ్మిస్తారు. రిక్వెస్ట్‌కు స్పందించగానే చాటింగ్ చేస్తారు. సామాజిక హోదా, వయసు ధ్రువీకరణ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి దాటాక వాట్సప్ ఫోన్‌కాల్ చేసి గంటల తరబడి మాట్లాడుతున్నారు. ట్రాప్‌లో పడ్డట్లు నిర్ధారణకు వచ్చాక నేరప్రణాళికను అమలు చేస్తున్నారు. వాట్సప్‌లో ఫ్రంట్ కెమెరా ద్వారా నగ్న వీడియోకాల్ చేస్తారు.. దృశ్యాలను ఇవతలి వ్యక్తి చూస్తున్నట్లు స్క్రీన్ రికార్డింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఎదురు తిరిగితే బెదిరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2021 నుంచి సైబర్ నేరాలు ఇలా..



1930 నంబరుకు ఫిర్యాదు చేయండి

సైబర నేరగాళ్ల ఆటకట్టించడానికి సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ సెల్ నంబరు 1930కు ఫిర్యాదు చేయాలి. బాధితుల పేరు, మెయిల్ చిరునామా, ఇతర వివరాలను ఫిర్యాదులో పేర్కొనాలి. నేరం ఎలా జరిగిందనే అంశాన్ని నమోదు చేయాలి. అత్యవసరమైతే స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలి. అలాగే **'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.జీవోవి.ఇన్'** వెబ్‌సైట్‌లోకి వెళ్లి నేరానికి సంబంధించిన వివరాలను నమోదు చేసి పంపాలి. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, మెయిల్‌ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్రెండ్ రిక్వెస్టులకు అంగీకారం తెలపకుండా అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అత్యాశ, అవగాహన రాహిత్యంతోనే..

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం



మానవ బలహీనతలతోనే సైబర్ నేరాలు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. అత్యాశ, అవగాహన రాహిత్యంతో నేరగాళ్లలో వలలో చిక్కుకుంటున్నారు. డబ్బు ఆశను ఆసరాగా చేసుకుని నేరాలు అధికంగా జరుగుతున్నాయి. ఈమధ్య కాలంలో డిజిటల్ అరెస్టు, ఫెడెక్స్ ఉచ్చులో పడి యువత ఎక్కువగా నష్టపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌కు స్పందించవద్దు. హానీట్రాప్, డేటింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు.

ఆకలి తీరుస్తోన్న దాతృత్వం


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న కళాశాల ఛైర్మన్ బండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో దాతల దాతృత్వంతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రోజూ 500 మంది విద్యార్థినులు కడుపునిండా మధ్యాహ్న భోజనం తింటున్నారు. దాతల సహకారంతో 13 ఏళ్లుగా పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బండి వేణుగోపాల్ ప్రత్యేక చొరవ తీసుకొని ఏటా దాతల సహకారంతో ఈ సౌకర్యం కల్పిస్తున్నారు. పట్టణానికి చెందిన చేనేత పట్టుచీరల వ్యాపారులు దాతలుగా ముందుకు వచ్చి ఆర్థికసాయం అందిస్తున్నారు. రోజూ రూ.10 వేలు వెచ్చించి 500 మంది ఆకలి తీరుస్తున్నారు.

రోజూ రుచికరంగా..

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు అధికంగా ఉన్నారు. ధర్మవరం, బత్తలపల్లి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లోని

13 ఏళ్లుగా కళాశాలలో మధ్యాహ్న భోజనం


గ్రామాల నుంచి, పట్టణ శివారు కాలనీల నుంచి వచ్చేవారు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడేవారు. ఉదయాన్నే అల్పాహారం తిని కళాశాలకు వచ్చేవారు. మధ్యాహ్న భోజనం లేక 13 ఏళ్ల కిందట తాగునీటితోనే కడుపు నింపుకునేవారు. వీరి పరిస్థితిని కళ్లారా చూసిన కమిటీ ఛైర్మన్ వేణుగోపాల్, ధర్మవరానికి చెందిన పట్టుచీరల వ్యాపారి చట్టా వెంకటనారాయణ విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. దాతలను సంప్రదించడంతో మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చి ప్రతి ఏటా విరాళాలు అందిస్తున్నారు. ఈ విషయమై కళాశాల ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో విద్యార్థినులు ఆకలితో ఇబ్బంది పడుతుండటం, కొందరు ఇళ్లకు వెళ్లడం కళ్లారా చూశా. మధ్యాహ్న భోజన పథకం మొదలుపెట్టిన తర్వాత హాజరు వంద శాతం, ఏటా ఉత్తీర్ణత శాతమూ పెరుగుతోంది. ఖర్చులు పెరిగినా దాతల చేయూతతో పథకాన్ని ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

చదువుపై మరింత శ్రద్ధ

- చిన్ని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం



ఇంట్లో ఉదయాన్నే అల్పాహారం తిని కళాశాలకు వస్తున్నాను. మధ్యాహ్నం కళాశాలలోనే భోజన సౌకర్యం ఉండటంతో ఎంతో వెసులుబాటుగా ఉంది. సాయంత్రం 4 వరకు కళాశాలలో తరగతులకు హాజరై శ్రద్ధగా పాఠాలు వింటున్నాం. మొదటి సంవత్సరంలో మంచి మార్కులు తెచ్చుకున్నాను. మధ్యాహ్న భోజనం మా ఆకలి బాధను తీరుస్తోంది.


నీటి చేరిన మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు


దక్షిణ కాలువకు నీరు విడుదల

నీటి రాక మొదలు.. ఆనందం రెండింతలు

హెచ్చెల్సీ నీటి రాకతో గార్లదిన్నె మండలంలోని పెనకచర్ల గ్రామంలో మిడ్‌పెన్నార్ జలాశయానికి జలకళ సంతరించుకుంది. చుట్టూ కొండలు, గుట్టలు పచ్చదనం పరచుకున్నాయి. దీనికి జలకళ తోడవడంతో పరిసర ప్రాంతాలు కనువిందు చేస్తున్నాయి. 5.2 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయానికి ప్రస్తుతం 1.6 టీఎంసీల తుంగభద్ర జలాలు చేరాయి. జలాశయం దక్షిణ కాలువ ద్వారా ఇటీవల సాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయటంతో ఆయకట్టు రైతుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతోంది.

- ఈనాడు, అనంతపురం

నిషేధిత భూముల్లో దందా

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో అక్రమాలు

ఈనాడు డిజిటల్, పుట్టపర్తి

భవిష్యత్తు అవసరాలు, పరిశ్రమల ఏర్పాటు కోసం గుర్తించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గతంలో ఏపీఐఐసీ నోటిఫై చేసిన భూముల్లో జోరుగా స్థిరాస్తి వ్యాపారం సాగుతోంది. గత వైకాపా ప్రభుత్వంలో రెచ్చిపోయిన రియల్ వ్యాపారులు సుమారు 100 ఎకరాల భూమిల్లో ఇప్పటికే క్రయవిక్రయాలు జరిపినట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు అక్రమార్కులకు పూర్తిగా సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికి కూతవేటు దూరంలో జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

455 ఎకరాల గుర్తింపు

2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం పరిశ్రమల కోసం 102 ఎకరాల భూమిని సేకరించి ఏపీఐఐసీకి అప్పగించింది. తర్వాత 2020లో అప్పటి వైకాపా ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు కోసం భూముల సమీకరణకు శ్రీకారం చుట్టింది. పరిహారంపై రైతులతో రెండు విడతలుగా రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు సమావేశాలు నిర్వహించారు. సంబంధిత రైతుల నుంచి భూముల్ని తీసుకుంటామని.. 455 ఎకరాల వరకు గుర్తించారు. ఆర్‌సినెం:143/ఎ/2020 కింద 231, 232, 233, 234, 235 178, 254, 256, 257, 258, 259, 266, 267, 268, 269, 270, 298, 299, 300, 301, 302, 303, 304, 305, 306, 307, 308, 179, 215, 271, 211, 212, 230, 317, 318, 319, 320, 321, 322, 177, 276, 277, 278, 180, 210 సర్వే నంబర్లలో 445 ఎకరాలు గుర్తించారు. ఆయా సర్వే నంబర్లలో క్రయవిక్రయాలు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వైకాపా నాయకులతో కలిసి క్రయవిక్రయాలు

జిల్లా పునర్విభజన తర్వాత పుట్టపర్తిని జిల్లా కేంద్రం చేయడంతో భూసేకరణ ప్రక్రియ ఆలస్యమవుతూ వచ్చింది. దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు స్థానిక వైకాపా నాయకులతో చేతులు కలిపారు. ఏపీఐఐసీ గుర్తించిన భూములను ప్లాట్లుగా మార్చి వ్యాపారం చేశారు. ఇప్పటికే 100 ఎకరాలకుపైగా ఇతరులకు అమ్మేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. కప్పలబండ పరిధిలో ఏపీఐఐసీ గుర్తించిన భూములపై నిషేధం ఉన్నా క్రయవిక్రయాలు జరగడం వెనుక అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తు అవసరాలకు భూమి మిగలదనే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రం ఏర్పడిన నేపథ్యంలో విస్తరణ, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కార్యాలయాలు ఇతర అవసరాలకు భూమి లభ్యత ప్రశ్నార్థకంగా మారింది.

విచారణ జరిపిస్తాం - చేతన్, కలెక్టర్, శ్రీసత్యసాయి

నిషేధిత జాబితాలోని సర్వే నంబర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్టర్ చేయడానికి వీలు లేదు. కప్పలబండ పరిధిలో ఏపీఐఐసీ కోసం గతంలో భూములు గుర్తించిన మాట వాస్తవమే. ఆయా భూములను క్రయ విక్రయాలకు పాల్పడిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై విచారణ జరిపిస్తాం. అక్రమాలు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.


పరిశ్రమలకు గుర్తించిన భూముల్లో చేపట్టిన నిర్మాణాలు

గుండె లయ.. మారుతోందయా!

నేడు హృదయ దినోత్సవం





సూపర్‌స్పెషాలిటీ కార్డియాలజీ విభాగంలో చికిత్స పొందుతున్న బాధితులు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే

జీవనశైలిలో వేగంగా వస్తున్న మార్పులతో హృదయ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా గుండెపోటుకు గురవుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపిన వారు ఉన్నఫళంగా కుప్పకూలి మృత్యువడికి చేరుకుంటున్నారు. రోజు వారీ పనుల్లో ఒత్తిడి, వ్యాయామం చేయకపోవటం, ఆహార అలవాట్లు, పొగ తాగడం.. తదితర కారణాలతో ఎక్కువ మంది గుండెపోటుకు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో సగటున ఒకటి నుంచి 2 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటున్నారు.

ఇవి పాటిద్దాం..

రోజూ కనీసం 45 నిమిషాలపాటు వ్యాయామం చేయాలి. చెమట పట్టేంత వరకు నడక సాగించాలి. ఆకుకూరలు, కూరగాయలతోపాటు పండ్లు తినాలి. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి.



సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో 20 వేల మందికిపైగా..

అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో కార్డియాలజీ విభాగం ఉంది. 2022 నుంచి ఓపీ, ఐపీ సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 20,753 మందికి ఓపీ సేవలు అందించారు. 924 మంది ఇన్‌పేషెంట్లు చికిత్స చేయించుకున్నారు. వారిలో 642 మందికి యాంజియోగ్రామ్ చేశారు. 266 మందికి స్టంట్స్ వేశారు. ఇప్పటి వరకు 79 మంది మృతి చెందారు.

ఉమ్మడి అనంత జిల్లాలో ఆరోగ్యశ్రీ (ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ) కింద గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స పొందిన వారి వివరాలు ఇలా..

సంవత్సరం	చికిత్స పొందిన వారు	బైపాస్ సర్జరీ	స్టంట్స్, ఔషధాలతో చికిత్స పొందిన వారు
2022-23	7,909	1,946	5,963
2023-24	10,365	934	9,431
2024 (ఆగస్టు వరకు)	2,827	310	2,500

స్వస్తి పలుకుదాం!

సాధ్యమైనంత వరకు కొవ్వు సంబంధిత పదార్థాలకు దూరంగా ఉండాలి. పిజ్జా, బర్గర్, ఫ్రెంచ్‌ఫ్రైస్, చాక్లెట్లు, మటన్ తదితర వాటిని తీసుకోకపోవడమే ఉత్తమం. ఒత్తిడికి లోను కావద్దు. సాధ్యమైనంత వరకు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. అనవసర విషయాలపై ఆలోచించి ఆందోళనకు గురికావద్దు.



లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దు

- డాక్టర్ సుభాష్‌చంద్ర బోస్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజీ, సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల



ఛాతిమీద బరువుగా, పట్టేసినట్లు ఉండటం, మంట రావడం, చేయి నుంచి దవడ వరకు నొప్పి, చెమటలు పట్టడం.. తదితర లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. వారి సూచన మేరకు చికిత్స పొందాలి. ప్రతి ఒక్కరూ సీపీఆర్ విధానంపై అవగాహన కలిగి ఉండాలి. కొంత మందిలో హార్ట్‌బీట్ పెరుగుతుంటుంది. అలాంటి సమయాల్లో గట్టిగా దగ్గితే సాధారణ స్థితికి చేరుకుంటుంది. గుండెపోటు లక్షణాలు బహిర్గతమైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. ఉమ్మడి జిల్లాలోని ప్రాంతీయ, సామాజిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది పరీక్ష చేసి.. గుండెపోటు వచ్చినట్లు నిర్ధారిస్తే వెంటనే ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా రూ.42 వేలు చేసే టెనెక్ట్‌ప్లేస్ ఇంజెక్షన్ ఉచితంగా వేస్తారు. గుండెపోటు మరణాలను తగ్గించేందుకు ఇంజెక్షన్లను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఇంజెక్షన్ వేసిన అనంతరం రోగి కోలుకున్న తరువాత మెరుగైన చికిత్స కోసం నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపుతారు.

మధుర ఫలం.. ఆరోగ్యం.. ఆదాయం

రాయదుర్గం, న్యూస్‌టుడే: తేనె లాంటి తియ్యదనం.. ఆరోగ్యాన్నిచ్చే సీతాఫలాల విక్రయాలు రాయదుర్గం మార్కెట్లో ఊపందుకున్నాయి. కొండలు, గుట్టలు, అడవుల్లో వర్షాధారంగా లభించే ఈ మధుర ఫలాలు వేల మంది రైతులు, కూలీలకు ఉపాధినిస్తున్నాయి. పలువురు రైతులు తోటల్లో అంతర పంటగా సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురవటంతో ఆశించిన మేర దిగుబడి వచ్చింది. రోజూ టన్నుకుపైగా సీతాఫలాలు లభిస్తున్నాయి. ఈ లెక్కన సీజన్‌లోపు(సెప్టెంబర్ నుంచి డిసెంబరు) వరకు దాదాపు వంద టన్నుల దిగుబడి రావచ్చని రైతులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో లభించే సీతాఫలాల కన్నా.. ఇక్కడి ఫలాలు మధురంగా ఉంటాయి. రాయదుర్గం కొండల్లో మేలురకం సీతాఫలాలు లభిస్తున్నట్లు గతంలోనే ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఆశాజనకంగా దిగుబడి

పరిమాణం మేరకు ధర

గంపల్లో తెచ్చిన వంద సీతాఫలాలను రూ.250 నుంచి రూ.500 దాకా విక్రయిస్తున్నారు. పరిమాణం, నాణ్యతను బట్టి కిలో రూ.60- రూ80 దాకా ధర పలుకుతోంది. ఇక్కడి నుంచి బెంగళూరు, అనంతపురం, బళ్లారి, దావణగెరె, శివమొగ్గ, హాసన్, చెళ్ళకెర తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు.






సీతాఫలాల విక్రయాలు

వెయ్యి కుటుంబాలకుపైగా ఉపాధి

రాయదుర్గం మండలంలోని మెచ్చిరి, పైతోట, కొండలు, గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డి తదితర ప్రాంతాల్లో సీతాఫలాలు లభిస్తాయి. వాటి విక్రయాలతో వెయ్యి కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఆ చెట్లు ఉండే కొండను ఏటా రూ.50వేలకు వాల్మీకి సంఘం నాయకులు పొంది సబ్‌లీజుకు ఇస్తుంటారు. వన సంరక్షణ సమితుల ఆధ్వర్యంలో రైతులు చెట్లను కొనుగోలు చేసి సీతాఫలాలను పట్టణంలో విక్రయిస్తుంటారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



ఈ ఏడాది పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. మూడు నెలల పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులకు ఉపాధి లభిస్తుంది. అటవీశాఖాధికారులు సీతాఫలం చెట్లను విరివిగా పెంచాలి. మార్కెట్ సౌకర్యం కలిస్తే మరింత ఆదాయం సమకూరనుంది.

- తిప్పేస్వామి, రాయదుర్గం

దీటైన ధీరజ్



యాప్‌ల రూపకర్తగా ప్రశంసలు

గోరంట్ల, పరిగి, న్యూస్‌టుడే: ధీరజ్ గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తల్లి చందన గృహిణి. తండ్రి శ్రీధర్ చిరువ్యాపారి. అందరి విద్యార్థుల్లా నిత్యం పాఠశాలకు వెళతాడు. అందరిలా కాకుండా తన మెదడుకు కాస్త పదును పెట్టి భిన్నంగా ఆలోచిస్తాడు. ప్రపంచాన్ని అరచేతిలో వైకుంఠంలా చూపిస్తున్న కంప్యూటర్ రంగంపై పదేళ్ల వయసులోనే దృష్టి పెట్టాడు. మూడేళ్లలో పలు యాప్‌లు తయారుచేసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. స్థానికంగా జరిగిన పలు కార్యక్రమాల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముగ్గురు కలెక్టర్లు, డీఈవో నుంచేగాక మంత్రి చేత అభినందనలు, ప్రశంసలు, జ్ఞాపికలు అందుకుని అందరి మన్ననలు పొందుతున్నాడు. ఇప్పటికే హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా, జావాస్క్రిప్ట్, రియాక్ట్‌నేటివ్ అనే కంప్యూటర్ భాషల్లో పట్టుసాధించాడు.



కలెక్టర్ చేతన్‌కు యాప్ గురించి వివరిస్తున్న ధీరజ్

రూపొందించినవి ఇవీ..

- జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో: 2023 జనవరిలో గుజరాత్‌లో జరిగిన జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ పోటీల్లో పాల్గొని చిన్న పిల్లల పుస్తకాల సంచి బరువు తగ్గించే ఆలోచనతో బ్యాక్‌ప్యాక్ 2.0 అనే పేరుతో తయారుచేసిన యాప్ ప్రదర్శించాడు.
- ఈ ఏడాది జూన్‌లో తయారుచేసిన లర్న్ ఈజీయాప్‌ను డీఈవో మీనాక్షి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈయాప్‌ద్వారా ఆరు నుంచి పదోతరగతి వరకు విద్యార్థులు ఆంగ్లం గ్రామర్, సైన్సు, జనరల్‌నాలెడ్జ్, రీజనింగ్ తదితర అంశాలను సులభంగా నేర్చుకునేందుకు దోహదపడే విధంగా తయారుచేసి ప్రస్తుతం పది భాషల్లోకి అనువదిస్తున్నాడు.
- మైటౌన్ - గోరంట్ల అనే యాప్‌తో స్థానికంగా ఉన్న ఆలయాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఏటీఎం ఇలా... అనేక సమాచారం తెలుసుకోవచ్చు.
- ప్రపంచ పర్యాటకం దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల వివరాలను యాప్‌లో రూపొందించి పర్యాటలకు సులభంగా సమాచారం తెలిసేలా అయిదు భాషల్లో రూపొందించాడు.



దిల్లీలో రాజముద్రతో కూడిన పట్టువస్త్రాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్

ధర్మవరం చేనేత వస్త్రంపై రాజముద్ర

ధర్మవరం, న్యూస్‌టుడే: హిందీ పక్షం పురస్కరించుకొని ధర్మవరం చేనేత కార్మికుడు, డిజైనర్ జుజూరు నాగరాజు రూపొందించిన హిందీ దేశ గర్వం అనే నినాదం, భారత రాజముద్ర డిజైన్‌తో కూడిన పట్టువస్త్రాన్ని శనివారం దిల్లీలో కేంద్రజౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆవిష్కరించారు. విజయవాడ చేనేత సేవాకేంద్రం సహకారంతో డిజైనర్ నాగరాజు పట్టు, బంగారు జరీ పోగులను ఉపయోగించి పట్టువస్త్రంపై చేతితో డిజైన్ వేశారు. వస్త్ర తయారీలో చేనేత కార్మికుడు సురేంద్రబాబు, రాఘవ సహాయపడ్డారని నాగరాజు తెలిపారు.

బీఈడీ కళాశాలలో తాత్కాలిక బోధన ఉద్యోగాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బీఈడీ కళాశాలలో తాత్కాలిక బోధన ఉద్యోగాలు (అకడమిక్ కన్సల్టెంట్) భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. ఫిజికల్ సైన్స్ మెథడాలజీ, ఎంఈడీ, పీహెచ్‌డీ, నెట్ ఉన్నవారు ఉద్యోగాలకు అర్హులు. ఈ నెల 30న నేరుగా వాక్‌ఇన్‌ఇంటర్వ్యూకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి



RAMOJI FILM CITY





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై జగన్ క్షమాపణ చెప్పాలి

ధర్మవరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసి భక్తుల మనోభావాలు దెబ్బ తీశారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ధర్మవరం పట్టణంలో తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కమీషన్లకు కక్కుర్తిపడే నాసిరకం నెయ్యి సరఫరా చేశారన్నారు. అప్పటి సీఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి బంధుప్రీతితో వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిని తి.తి.దే ఛైర్మన్లుగా, అనుకూలంగా ఉన్న అధికారి ధర్మారెడ్డిని ఈవోగా నియమించారని ఆరోపించారు. చేసిన తప్పులు ఒప్పుకొని జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను తగ్గించే విధంగా జగన్ వ్యవహరించారని విమర్శించారు. దళితులను అన్యమతస్థులుగా జగన్ చిత్రీకరిస్తూ మాట్లాడుతుండటం వారిని అవమానించడమేనన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో నాసిరకం నెయ్యి వినియోగంపై సరైన విచారణ జరుగుతుందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

జీతాలు చెల్లించాలని కార్మికుల సమ్మె

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు 13 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో శనివారం ముదిగుబ్బలోని దొరిగల్లు రోడ్డులో పంప్‌హౌస్ ఎదుట నిరసన తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి 80 గ్రామాలకు వెళ్లే తాగునీటిని నిలిపివేసి సమ్మె చేపట్టారు. దీంతో ఆయా గ్రామాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడు నెలలుగా పెండింగ్ జీతాలు చెల్లించలేదని ఇటీవల సత్యసాయి కార్మికులు నిరసన చేపట్టడంతో రూ.30 కోట్లు విడుదల చేశారని, ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులకు 13 నెలల జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వకపోతే తాము ఎలా విధులు నిర్వహించాలని, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ముదిగుబ్బలో నినాదాలు చేస్తున్న కార్మికులు

సూపరింటెండెంట్‌పై వైద్యుల ఫిర్యాదు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్‌పై అందులో పని చేసే కొంతమంది వైద్యులు శనివారం ఆ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న సివిల్ అసిస్టెంట్‌ల కన్నా జూనియర్ వైద్యుడని, ఇతను ఎలాంటి పరిపాలన డిగ్రీ అభ్యసించలేదని, క్లినికల్ వైద్యుడు కాదని, ఆసుపత్రిలో మిగిలిన వైద్యులతో మంచి సంబంధాలు కొనసాగించటం లేదని అందులో పేర్కొన్నారు. ఈ విషయం ఆసుపత్రి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు అంతర్గతంగా ఉన్న ఈ సమస్య ప్రస్తుతం ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రి దృష్టికి వెళ్లటం భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లటంతో ఆసుపత్రిలో ఉన్న వైద్యుల్లో కొంతమంది మాత్రమే ఫిర్యాదులో సంతకాలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తాను ఆసుపత్రిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముందుకు వెళుతున్నానని, తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవన్నారు.

'వైకాపా నాయకులకు దేవుడే బుద్ధి చెబుతాడు'

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డుపై వైకాపా నాయకులు దాగుడు మూతలు మానకపోతే ఆ వెంకటేశ్వరస్వామే తగిన బుద్ధి చెబుతాడని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. శనివారం స్థానిక పేట వెంకటరమణస్వామి ఆలయంలో వైకాపా నాయకులు వేణురెడ్డి, పార్టీ నాయులు ప్రత్యేక పూజలు చేయించారు. వైకాపా నాయకులు చేసిన తప్పు కప్పిపుచ్చుకోవటానికి బూటకపు పూజలు చేస్తే ఆ దేవుడు క్షమించడని సాయంత్రం తెదేపా నాయకులు పేట వెంకటరమణస్వామి ఆలయంలో పసుపు జలాలతో సంప్రోక్షణ నిర్వహించి ఆలయాన్ని శుద్ధి చేశారు. అంజినప్ప మాట్లాడుతూ తిరుమల లడ్డుకల్తీ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసం బయట పడిందన్నారు. వైకాపా నాయకులకు నిజంగా భగవంతుడిపై భక్తి ఉంటే చేసిన తప్పును ఒప్పుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న తెదేపా నాయకులు

న్యాయస్థానాలకు భవనాలు సమకూర్చండి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: హిందూపురంలో న్యాయస్థానాల నిర్వహణకు ప్రత్యామ్నాయ భవనాల సౌకర్యం కల్పించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస రెడ్డి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. పస్తుతం న్యాయస్థానం నిర్వహిస్తున్న భవనాలు శిథిలావస్థకు చేరుకొంటున్నందున వీటి మరమ్మతులు చేసేంత వరకు కోర్టులు నిర్వహించుకోవటానికి అనువైన ప్రత్యామ్నాయ భవనాలు సమకూర్చండి అని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా అధికారులకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలన న్యాయమూర్తి ఆదేశించారన్నారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి



గుడిబండ, న్యూస్‌టుడే: గుడిబండ మండలం ఎస్ ఎస్ గుండ్లు గ్రామంలో శనివారం బకెట్ నీటిలో చిన్నారి పడి మృతి చెందింది. ఎస్ఎస్ గుండ్లుకు చెందిన జయరామ్, సింధూ దంపతులకు కుమార్తె జన్మించింది. చిన్నారికి 14 నెలలు కాగా పేరు కూడా పెట్టలేదు. త్వరలో గ్రామంలోని ఇలవేల్పు ఏడుమంది అక్కమ్మల ఆలయంలో తలనీలాలు సమర్పించి నామకరణం చేయాలని నిర్ణయించారు. శనివారం ఇంటిముందు ఆడుకుంటూ పాకుతూ వెళ్లి బకెట్‌లో ఉన్న నీటిలోకి జారిపడింది. తల్లిదండ్రులు చూసుకుని మడకశిరకు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనను చూసిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు.

విశ్రాంత ఏఎస్సై ఇంట్లో చోరీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డు గణేశ్‌నగర్‌లో విశ్రాంత ఏఎస్సై వీరాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. బాధితుని కుటుంబం ఇటీవల శిర్డీకి వెళ్లింది. తిరిగి శనివారం ఇంటికి రాగా తాళాలు ధ్వంసమై ఉండటం గమనించారు. ఇంట్లో కెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. వాటిలో పరిశీలించగా రూ.98 వేలు విలువ చేసే 12 గ్రాముల బంగారం, ఉంగరం, గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు అనంత గ్రామీణం పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశాడు.

కనిపెంచిన అమ్మనే కాదనుకున్నారా?

మానసిక వేదనతో వృద్ధురాలి మృతి

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిరిడిసాయిబాబా ఆలయ ఆవరణలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. 10 రోజుల కిందట ఒకవ్యక్తి ఆటోలో తీసుకువచ్చి ఆలయ ఆవరణలో వదిలి వెళ్లాడని స్థానికులు తెలిపారు. తాను ఎవరనే విషయం ఎవరు అడిగినా వృద్ధురాలు చెప్పేది కాదని.. కుటుంబ సభ్యులే ఆటోలో వదిలి వెళ్లారని ఆవేదన చెందుతుండేదని స్థానికులు పేర్కొన్నారు. మానసిక వేదనతో వృద్ధురాలు మృతి చెందినట్లు ఆలయ ఆవరణలో ఉంటున్న వారు చెప్పారు. పోలీసులకు తెలియడంతో పురపాలక అధికారులకు సమాచారం అందించారు. ఆమె మృతదేహాన్ని పురపాలక కార్మికులు పట్టణంలోని గాంధీనగర్ శ్మశానవాటికలో ఖననం చేశారు.



కర్ణాటక పోలీసుల కారు బోల్తా

ఇరానీ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఎస్ఐ, సిబ్బందికి గాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: కర్ణాటకలో చోరీలకు పాల్పడి పరారీలో ఉన్న ఇరానీ ముఠా సభ్యులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పట్టుకునేందుకు కారులో వెంటపడుతున్న కర్ణాటక పోలీసుల వాహనం ధర్మవరం మండలం రాంపురం క్రాస్ వద్ద శనివారం అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసులు ప్రమాదానికి గురికావడంతో ఇరానీ గ్యాంగ్ సభ్యులు తప్పించుకున్నారు. ప్రమాదంలో తుముకూరు జిల్లా మెడిగేశి పోలీసుస్టేషన్ ఎస్ఐ అమ్మనగి, కానిస్టేబుళ్లు రమేష్, ప్రకాష్, ముద్దురాజు గాయపడ్డారు. వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందడంతో ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. చోరులను పట్టుకునే యత్నంలో వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యామని కర్ణాటక పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన వాహనం

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

శ్రీరామరెడ్డి క్రికెట్ టోర్నీ విజేతగా సూర్య విద్యానికేతన్



క్రీడాకారులు అభినందిస్తున్న రఘువీరారెడ్డి, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

మడకశిర గ్రామీణం : స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఎంపీ శ్రీరామరెడ్డి 119వ జయంతి ఉత్సవాల్లో భాగంగా 15 రోజులుగా నీలకంఠాపురంలో నిర్వహించిన శ్రీరామరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. తుదిపోరులో నీలకంఠాపురం జట్టు, సూర్యవిద్యానికేతన్ జట్టు తలపడ్డాయి. గెలిచిన సూర్యవిద్యానికేతన్ జట్టు క్రీడాకారులను మాజీ మంత్రి రఘువీరారెడ్డి, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. అక్టోబరు 6న బహుమతులు ప్రదానం చేయనున్నారు.

జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మడకశిర, న్యూస్‌టుడే : మడకశిర పట్టణంలో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని లోక్ కల్యాణ్ ప్రజా సాక్షి సమితి నాయకులు, విద్యార్థులు శనివారం నిరసన ప్రదర్శన చేపట్టి తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యదర్శి మస్తీయన్న, విరూపాక్ష తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న లోక్ కల్యాణ్ ప్రజా సాక్షి సమితి నాయకులు, విద్యార్థులు

30న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ఈనెల 30న హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేపీ అనిల్ కుమార్ తెలిపారు. వివరాలకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహ్మద్‌సలీమ్ 8099598958 నంబరుకు సంప్రదించాలన్నారు.

పాఠశాలకు దాతల సాయం

అమరాపురం : గౌడనకుంటలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రం డిపెప్ పాఠశాల అభివృద్ధికి ఆ గ్రామానికి చెందిన వీరేశ్‌తో పాటు అమెరికాలో స్థిరపడిన సుధాకర్ రూ.3.50 లక్షలు ఇవ్వడం అభినందనీయమని సీడీపీవో శాంతలక్ష్మి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి, పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు.

సీఐటీయూ మండల కార్యవర్గం

సోమందేపల్లి: సీఐటీయూ మండల కన్వీనర్‌గా రాజగోపాల్, కో కన్వీనర్‌గా రాజు, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబా, కార్యదర్శి రమేశ్ తెలియజేశారు.

లేపాక్షి ఎస్సైగా నరేంద్ర

లేపాక్షి : లేపాక్షి ఎస్సైగా నరేంద్ర శనివారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన గోపి తనకల్లుకు బదిలీపై వెళ్లారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఇక్కడికి వచ్చారు.

దరఖాస్తు చేసుకోండి

మడకశిర గ్రామీణం: మండలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లడగుంట ఆంజనేయస్వామి సముదాయ దేవాలయాల ధర్మకర్తల మండలి నియామకం కోసం 15 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి బి.నరసింహరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

కొడిగెనహళ్లి(పరిగి): కొడిగెనహళ్లిలో శనివారం భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. సేవామందిర్‌లోని అందుల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులకు పండ్లు ,మిఠాయిలు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు కార్తీక్, సభ్యులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

హిందూపురం అర్బన్ : హిందూపురం సబ్‌రిజిస్ట్రార్‌గా శనివారం రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. సబ్‌రిజిస్ట్రార్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో ప్రజలకు మంచి సేవలు అందిస్తామన్నారు. అనంతరం స్థిర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు రియాజుల్ తదితరులు సబ్‌రిజిస్ట్రార్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


పంచాయతీరాజ్ ఇంజినీర్‌గా రవికుమార్

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సోమందేపల్లి మండలం పంచాయతీరాజ్ ఇంజినీర్‌గా ఎట్టకేలకు శనివారం రవికుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాడిమర్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెండేళ్ల కిందట ఇక్కడ పనిచేస్తున్న హేమ్లానాయక్ పామిడికి బదిలీ కాగా అప్పటినుంచి ఇక్కడ పోస్టు ఖాళీగా ఉంది.

అమ్మాయిలను వేధిస్తున్నారని ఫిర్యాదు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన పలువురు అమ్మాయిలు గోరంట్లలోని కళాశాలల్లో చదువుకుంటున్నారు. అదే కళాశాలల్లో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన కొంతమంది అబ్బాయిలు నిత్యం కళాశాల పరిసరాల్లో, బస్సుల్లో, బస్టాండు వద్ద వారిని వేధిస్తుండడంతో విసిగిపోయిన కొండాపురం గ్రామస్థులు పెద్దసంఖ్యలో శనివారం రాత్రి పోలీసుస్టేషన్ వద్దకు తరలివచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సీఐ శేఖర్ వేధింపుల కోసం పాల్పడుతున్న అబ్బాయిల కోసం గ్రామాలకు పంపి ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పెరటి తోట.. ఆదర్శంగా నిలుస్తున్న రొద్దం కస్తూర్బా విద్యార్థినులు ఆరోగ్య బాట





రొద్దం కస్తూర్బాలో బిందు పరికరాలతో మిరపతోట

పెనుకొండ పట్టణం, రొద్దం, న్యూస్‌టుడే: ఆ బడిలో చదివే కాదు.. మంచి ఆరోగ్యం దక్కుతోంది. దాన్ని అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థినులే చేసుకున్నారు. ఎలాగంటారా.. ఉన్న స్థలాన్ని ఉపయోగించారు.. పెరటి తోటలో కూరగాయలను సేంద్రియ పద్ధతిలో సాగు చేశారు.. వచ్చిన పంటను వారి వంటల్లో వాడి ఆరోగ్యకరంగా ఉన్నారు.. ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా.. అదేనండి రొద్దం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో.. ఏం చేశారో చూసి మనం చేద్దామా..

ఇక్కడ 258 మంది విద్యార్థినులు చదువుతున్నారు. నీటి సౌకర్యం ఉన్న పాఠశాలల్లో పెరటి తోటల పెంపకం చేపట్టాలన్న ఉన్నతాధికారుల ఆదేశంతో పాఠశాల ఎస్‌వో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి 3 నెలల కిందట ఒక సెంటు ఉపయోగించి సేంద్రియ విధానంలో ఆకుకూరలు, కూరగాయల సాగు ప్రారంభించారు. వీటితో పాటు మునగ, అరటి, కొబ్బరి చెట్లు నాటి సంరక్షిస్తున్నారు. ఇక్కడ పండించిన కూరగాయలు, ఆకు కూరలతో ప్రతిరోజు విద్యార్థినుల కోసం తయారు చేసే ఆహారంలో వాటిని వినియోగిస్తున్నారు. తద్వారా ప్రతిరోజు రూ.200 ఆదా యంతో పాటు విద్యార్థినులకు ఆరోగ్యం లభిస్తుంది.

నాణ్యమైన కూరలతో ఆహారం



విద్యార్థినులకు పాఠశాల ఆవరణలోని పెరటితోటలో పండించిన కూరగాయలు, ఆకుకూరలతో వండిన నాణ్యమైన కూరలతో వండిన ఆహారం అందిస్తున్నాం. పాఠశాలలో 258మంది చదువుతున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు తోట నిర్వహణ చూసుకుంటున్నారు. తోటలో రకరకాల కూరగాయల మొక్కలు పెంపకంలో వారు ఆసక్తి చూపుతున్నారు. -నాగరత్నమ్మ ఎస్‌వో, కేజీబీవీ, రొద్దం

సెలవు రోజుల్లో సంరక్షణ



ఇంటిని వదిలి గురుకులంలో ఉన్నామన్న భావన తగ్గి, ఇంట్లో ఉన్నట్లుగానే ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పెరటితోటను పరిశీలిస్తాం. సెలవురోజుల్లో తోట సంరక్షణ కోసం ఎక్కువ సమయం కేటాయిస్తాం. స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవడం వల్ల కలిగే లాభాలు గుర్తించాం. ఎలాంటి పురుగుమందులు వినియోగించకుండా పంటలు పండిస్తున్నాం. పండించిన కూరలనే వండి కోవడం సంతోషంగా ఉంది. -బిందు, నిహారిక, తొమ్మిదోతరగతి

పెంపకంతో ఉత్సాహం



పాఠశాలలో చదువు మాత్రమే కాకుండా పెరటితోట పెంచడం ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. పాఠశాల ముగిసిన తరువాత పదినిమిషాల పాటు తోటలో గడిపితే ఎంతో ఆహ్లాదాన్నిస్తుంది. మొక్కలకు నీళ్లు పడుతున్నాయా లేదా అని ప్రతిరోజు పరిశీలిస్తాం. మొక్కలకు కేవలం సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తాం. తోటలో కలుపు లేకుండా చూస్తాం. కళ్లెదిటి ఆకు కూరలు, కూరగాయలు తింటున్నాం. -స్వప్న,అనూష, తొమ్మిదోతరగతి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: నాచేపల్లి, ఆవాలపాళ్యం గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగాయి. తొలగించాలి. -మూలతేశ్
సమాధానం: చర్యలు తీసుకుంటాం. -రామారావు, ఎంపీడీఓ, గుడిబండ

సమస్య: పీఎస్‌పాళ్యంలో ట్యాంకు చుట్టూ అపరిశుభ్రం. -చంద్రప్ప
సమాధానం: కార్మికుల చేత తొలగిస్తాం. -నాగరాజునాయక్, ఈఓఆర్‌డీ -న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: అగళి పాఠశాల ఆవరణ మధ్యలో స్తంభం ఉంది. -నరసింహ
సమాధానం: మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. -వసంతకుమార్, లైన్‌ఇన్‌స్పెక్టర్, అగళి

సమస్య: పి.బ్యాడిగెర ఇందిరమ్మ కాలనీలో రోడ్డు నిర్మించండి. -ఉమేశ్
సమాధానం: ప్రతిపాదనలు పంపించాం. -ఫణిరాజు, కార్యదర్శి -న్యూస్‌టుడే, అగళి

మైనాస్వామికి ఉత్తమ ప్రచార పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మైనాస్వామి

గోరంట్ల, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గోరంట్లకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు మైనాస్వామిని విజయవాడలో శుక్రవారం పురస్కరించారు. ఈయన రచించిన ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర - లేపాక్షి అగ్రపుస్తకానికి అవార్డు వరించిందని తెలిపారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో పట్టణాభివృద్ధి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో పట్టణాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. తనపై ఎమ్మెల్యే నమ్మకం ఉంచి, ఇక్కడికి ప్రత్యేకంగా తీసుకొచ్చారని, నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని, మున్సిపల్ ఆదాయం తక్కువ ఉందని, ఖర్చులు ఎక్కువ ఉన్నాయని, ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్ను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, తెదేపా కౌన్సిలర్లు రమేశ్ తదితరులు, నాయకులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ కోరారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెదేపా కౌన్సిలర్లు, నాయకులు

అసత్య కథనాలపై చర్యలు తీసుకోండి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: 'తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా అసత్య కథనాలు ప్రచురించిన 'సాక్షి' దినపత్రిక యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మడకశిర శాసనసభ సభ్యుడు ఎం.ఎస్. రాజు శనివారం అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. తాను దళిత శాసనసభ్యుడిగా ఉన్నందువల్లనే ఓ సమావేశంలో తనకు ఆపాదిస్తూ వార్త ప్రచురించారన్నారు. తనకు ప్రత్యర్థంగా గానీ, పరోక్షంగా కానీ సంబంధం లేని విషయంలో తనను దోషిని చేసేలా పెంచారన్నారు. తనను మానసికంగా క్షోభ కలిగించేలా, అసత్య ఆరోపణలతో 'సాక్షి' పత్రికలో ప్రచురించిన సదరు పత్రిక రిపోర్టర్, సబ్ ఎడిటర్, బ్యూరో ఇన్‌చార్జి, ఎండీ మీద చర్యలు తీసుకోవాలని కోరారు.



అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

కళలు, సాహిత్యాన్ని ప్రోత్సహించాలి



మిమిక్రీ చేస్తున్న కోగిర జయచంద్ర

గోరంట్ల, న్యూస్‌టుడే: మానవ మనుగడకు ఎంతో అవసరమైన కళలు, సాహిత్యాన్ని ప్రతిఒక్కరూ అందించి ప్రోత్సహించాలని వక్తలు పేర్కొన్నారు. గోరంట్ల సాహితీ, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎస్పీవీఎం డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో వక్తలు పాల్గొని పలు విషయాలను తెలియజేశారు. సినీ నిర్మాత జీవం సురేష్, రిటైర్డ్ స్థల నటుడు, ఉపాధ్యాయుడు శంకర్, కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం, వేదిక నిర్వాహకులు జగదీష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప కారాగారం వద్ద సందర్శకుల గది ప్రారంభం



వేచి ఉండే గది వద్ద అధికారులు, సిబ్బంది

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఉప కారాగారం ఆవరణలో ఖైదీలతో ములాకత్ కోసం వచ్చే సందర్శకులు వేచి ఉండేందుకు నూతనంగా నిర్మించిన గదిని శనివారం సబ్‌జైళ్ల జిల్లా అధికారి అనిల్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలతో ములాకత్ కోసం వచ్చే సందర్శకులు ఎండ, వానకు బయట వేచి ఉండటం కష్టంగా ఉందని గుర్తించి, ప్రభుత్వం వారికోసం ప్రత్యేకంగా గది నిర్మించిందన్నారు. అనంతరం ఉపకారాగారంలోని రికార్డులను పరిశీలించారు. ఉపకారాగారం సూపరింటెండెంట్ ఆజీమ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే లో వంతెన .. బురద మయం



మలుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మించిన లోవంతెన మీదుగా వివిధ గ్రామాలకు ప్రజలు వెళ్లాల్సి ఉంది. వర్షం వస్తే నీరు నిలిచి అవి వెళ్లే మార్గం లేక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అంతర్గత రోడ్డు బురదమయంగా తయారవుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై మండల ఇంజినీరింగ్ అధికారి హనుమేనాయక్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి రోడ్డును బాగుచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

స్తంభం ఒరిగింది.. సరిచేయండి

హూస్సంపల్లి గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. కూలేందుకు సిద్ధంగా ఉన్న సరిచేయడం లేదని రైతులు, ఇందిరమ్మ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రజలు ఏఈ సురేష్‌ప్పను వివరణ కోరగా స్తంభాన్ని సరిచేయిస్తానని తెలిపారు. -న్యూస్‌టుడే, పరిగి



కుళాయి వేశారు.. పైపులైన్ మరిచారు



గోనపల్లి గ్రామం మధ్యలో ఏడేళ్ల కిందట నాగిరెడ్డి చేసిన శ్రీరామరెడ్డి తాగునీటి కుళాయి నీరు రాక వృథాగా ఉంది. పైపులైన్ నిర్మాణ ఇవ్వకపోవడంతో అప్పటి నుంచి వృథాగా ఉందని, నీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు అంటున్నారు. ఈ విషయమై ఈవోఆర్డీ నాగముని వివరణ కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి కుళాయి ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అమరాపురం

అర్ధాంతరంగా ఆగిన రోడ్డుకు మూడేళ్లు..!



గోరంట్లలో అసంపూర్తి రహదారి

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని రావికుంటకట్ట నుంచి సౌకెల్లాడ్ వరకు రోడ్డు విస్తరణ పేరుతో ప్రారంభించిన పనులు మూడేళ్లుగా అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఈ రహదారికి మోక్షం ఎప్పుడని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో ఆర్భాటంగా పనులు ప్రారంభించి పూర్తిచేయకుండా వదిలేయడంతో అవీధి, అప్రాంత ప్రజలు పడుతున్న నరకయాతన వర్ణనాతీతం. వర్షం వచ్చిందంటే ఆమార్గంలో అడుగుపెట్టలేని పరిస్థితి. కేవలం పెండమేటులు రహదారి నిర్మాణానికి ఎన్నిళ్లు కావాలని ప్రశ్నిస్తున్నారు. గోరంట్ల - కొడికొండ, గోరంట్ల - హిందూపురం రహదారులను కలుపుతూ ఆర్ అండ్ బీ శాఖ పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. ప్రధాన రహదారి తరువాత రద్దీగా ఉండే రహదారి కావడంతో పాటు అన్నిరకాల దుకాణాలు, బ్యాంకులు, ఆసుపత్రులు ఉండడంతో ప్రత్యేకంగా రాకపోకలతో కిటకిటలాడే ప్రాంతం. ఎగుడుదిగుడు, కంకరతేలిపోవడంతో మూడేళ్లుగా పడరానిపాట్లు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించే విషయంలో..

రోడ్డు విస్తరణలో భాగంగా రెండువైపులా ఆక్రమణలు తొలగించే విషయంలో రాజకీయాలు చోటుచేసుకుని పనులు ముందుకు సాగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని వీధుల్లోకి వెళ్లడానికి వీలుకాక, మరోవైపు నాలుగు చక్రాల వాహనాలు పెట్టుకున్న వారి బాధలు అన్నీ ఇన్నీ కావు. వాహనాలు వెళ్లిన సమయంలో దుమ్ము ఇళ్లలోకి, దుకాణాల్లోకి చేరి రోగాల బారిన పడుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమార్గంలో గోరంట్ల, చిలమత్తూరు మండలాలకు చెందిన సుమారు 25 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంది. కనీసం ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి ఆగిపోయిన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ సమస్యపై స్థానిక సర్పంచ్ నరేజయాని వివరణ కోరగా ప్రస్తుతం అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. కొత్త అధికారులు విధుల్లో చేరగానే వారితో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకొన్న ఉపాధ్యాయులను శనివారం స్థానిక రోటరీక్లబ్‌లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్కరించారు. -న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

పర్యాటకశాఖ గైడ్‌కు సన్మానం



గైడ్ విరుపన్నను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్, తదితరులు

లేపాక్షి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉత్తమ పర్యాటక శాఖ గైడ్‌గా మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా అవార్డు అందుకున్న విరుపన్నను శనివారం లేపాక్షి దుర్గా పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్, సిబ్బంది సన్మానించారు. ఆలయ అర్చకుడు లక్ష్మీనరసింహశర్మ, సిబ్బంది రాము, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి నీటి సరఫరాలో అంతరాయం

ఇబ్బందుల్లో పురం ప్రజలు



నీటి కోసం మహిళలు పడుతున్న కష్టాలు..

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: వారం రోజులుగా హిందూపురం పట్టణంలో నీటి సమస్య తీవ్రతరమైంది. పట్టణానికి నీటిని అందించే గొల్లపల్లి తాగునీటి పథకంలో పలుచోట్ల అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్‌లో మోటారు నిలిచిపోయింది. దానికి మరమ్మతులు చేయించి, నీటి సరఫరా ప్రారంభించగానే, ఎస్‌కేడీ వద్ద ఉన్న సంపు వద్ద ఏర్పాటు చేసిన ప్యానల్‌లో మంటలు చెలరేగి కాలిపోయింది. ఇలా ప్రతి చోట ఏదో ఒక సమస్య వస్తోంది. రోజు గొల్లపల్లి నుంచి 13 మిలియన్ లీటర్ల నీరు వస్తే కొన్ని ప్రాంతాలకు రెండు రోజులకు ఒకసారి, మరి కొన్ని ప్రాంతాలకు మూడు రోజులకు ఒకసారి అందించేవారు. ప్రాజెక్టు నుంచి ఒక్క రోజు నీరు రాకపోతే పట్టణంలో పలు ప్రాంతాలకు మూడు రోజులు సరఫరా నిలిచిపోతుంది. ప్రస్తుతం తలెత్తిన అంతరాయాల కారణంగా అనేక ప్రాంతాలకు వారం రోజులకు పైగా నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులకు చర్యలు

ఉన్న మాట నిజమే. గొల్లపల్లి ప్రాజెక్టు నుంచి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. దుల కారణంగా సమస్య వచ్చింది. మరమ్మతులు చేయిస్తున్నాం. మరి కొద్ది రోజుల్లో సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది. -బాలసుబ్రహ్మణ్యం, డీఈ, నీటి సరఫరా విభాగం.

• 80 వేల జనాభాపై ప్రభావం..

నీటి సరఫరాలో తలెత్తిన సమస్యల కారణంగా పట్టణంలోని 20 ప్రాంతాల్లోని 80 వేల జనాభాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ప్రాంతాల్లో వారం రోజుల నుంచి నీటి సరఫరా లేదు. పేదలు అధికంగా నివసించే రహమత్‌పురం, సీపీఐ కాలనీ, నేతాజీ నగర్, ధర్మపురం, తదితర ప్రాంతాలకు నీటిని అందించి 12 రోజులు గడిచిపోయింది. ఈ కాలనీలతో పాటు పట్టణంలోని ఇతర ప్రాంతాలకు ఎంజీఎం పాఠశాల ఆవరణలో ఉన్న ట్యాంకు ద్వారానే నీటిని అందించాల్సి ఉంటుంది. దీని సామర్థ్యం తక్కువ ఉండటం, సరఫరా చేయాల్సిన ప్రాంతాలు ఎక్కువ ఉండటం, ప్రస్తుతం నీరు రాకపోవడంతో ఈ కాలనీల్లో నీటి సమస్య మరింత తీవ్రతరమైంది. పలు కాలనీల్లో ఇంటి ముందు డ్రమ్ములను పెట్టుకొని, నీటిని కొనుగోలు చేసి, అందులో నిల్వ ఉంచుకొంటున్నారు.

వారం రోజులుగా నీళ్లందని కాలనీలు

టీచర్స్ కాలనీ, విద్యానగర్, పలిని నగర్, ఇందిరా నగర్, సూగూరు, ఆర్టీసీ కాలనీ, త్యాగరాజనగర్, ఆజాద్‌పేట, ముక్కిడి పేట, సత్యనారాయణపేట, గాంధీనగర్, కరుణపురం, బాపూజీ నగర్, సప్తపల్లి, ఎన్టీఆర్ కాలనీ, డి.ఆర్. కాలనీ, మోడల్ కాలనీ.



రహమత్‌పురంలో ఇలా ప్రతి ఇంటి ముందు డ్రమ్ములే...

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

రొళ్ల, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు మాత్రమే హాజరు కావడంతో రొళ్ల మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. శనివారం ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. విద్యుత్తు, రెవెన్యూ, ఇరిగేషన్, ఇంజినీర్, ఉద్యానశాఖ, అధికారులు గైర్హాజరయ్యారు. వచ్చిన అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. వ్యవసాయశాఖ అధికారి రాజ్యలక్ష్మి ప్రగతి నివేదిస్తున్న సమయంలో హాట్లే బెట్ట సర్పంచ్ ప్రకాశ్ కలగజేసుకుని మండలంలో వచ్చిన ఉలవల విత్తనాలు అందడం లేదని ప్రజాప్రతినిధులు ఇక్కడ చేయాల్సి వస్తాయా, వేరుసెనగ పంటను వేయని రైతులకు ఉలవలు అందించేలా చూడాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీడీవో ఆజాద్, ఎంఈవో శ్రీధర్, వైద్యాధికారి డాక్టర్ ప్రణీత్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, ఈవోఆర్డీ క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక స్నేహలతా నగర్ కాలనీలో శనివారం సిమెంటు రహదారి, మురుగు కాలువ నిర్మాణ పనులకు తెదేపా నాయకులు శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ కింద మొత్తం రూ.22 లక్షల నిధులను మంత్రి ఎస్.సవిత మంజూరు చేయించారు.

పుట్టపర్తి
• పుట్టపర్తి • ధర్మవరం • కదిరి • రాప్తాడు

బదిలీ అధికారులకు తెదేపా నాయకుల సన్మానం

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వేర్వేరు ప్రాంతాలకు వెళుతున్న అధికారులను మండల తెదేపా నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. శనివారం ఎంపీడీవో సాయిమనోహర్, ఏవో శ్రీదేవి, విస్తరణాధికారి దివాకర్, టైపిస్టు చిన్నయస్వామి, పీఆర్ ఏఈ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, హౌసింగ్ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శులు అలివేలు మంగమ్మ, పద్మావతి, పుణ్యచరిత, చంద్రకళ, పెద్ద శ్రీనివాసులు, డిజిటల్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌లను సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ధర్మవరం రైతు సంఘం అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, నాగభూషణ, సంగాల సూరి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా ఎస్పీ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న శనివారం అనంతపురం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

మురుగు శుద్ధి ప్లాంటుకు భూమిపూజ

కదిరి: మున్సిపాలిటీలో పారే మురుగు నీటిని శుద్ధికి ఏర్పాటు చేస్తున్న ప్లాంటు నిర్మాణానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట, మున్సిపల్ అధికారులు మాట్లాడారు. కుటాగుళ్ల సర్వేనంబరు 41లోని ఐదెకరాల్లో ప్లాంటు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు రూ.24కోట్ల నిధులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఇంజినీర్లు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు బీసీ కాలనీలో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే సింధూర శనివారం భూమిపూజ నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మండల అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. రూ.16 లక్షలు మంజూరు చేశామని తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామానికి చెందిన చిన్న రెడ్డెన్న ఐజీఎల వ్యాధితో అనారోగ్యంతో మృతి చెందాడు. ద్వాదశ దినకర్మ కార్యక్రమం నిర్వహణకు కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న వైకాపా నాయకుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం డాక్టర్ బత్తల వెంకటరమణ ద్వారా అందజేశారు. మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, డాక్టర్ రాంప్రసాద్, బాబా, జాకీర్ పాల్గొన్నారు.

సీకేపల్లి ఎస్ఐగా సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: సీకేపల్లి ఎస్ఐగా సత్యనారాయణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఉదయం 10 గంటలకు ఠాణాకు చేరుకున్న ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు పెనుకొండకు బదిలీపై వెళ్లగా వీఆర్‌లో ఉన్న సత్యనారాయణ సీకేపల్లి వచ్చారు.

విద్యుత్తు ఏడీఈగా లక్ష్మీనారాయణ బాధ్యతలు

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ఎన్.ఎస్ గేట్ ట్రాన్స్‌కో ఏడీఈగా లక్ష్మీనారాయణ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న నాగేంద్ర గుంతకల్లుకు బదిలీ కాగా.. అనంతపురంలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఎన్ఎస్ గేట్‌కు వచ్చారు. చెన్నేకొత్తపల్లి ఏఈగా పనిచేస్తున్న మదన్‌మోహన్ తాడిమర్రికి బదిలీపై వెళ్లగా అనంతపురం డీ-3లో పని చేస్తున్న రామాంజనేయులు బదిలీపై చెన్నేకొత్తపల్లికి వచ్చారు.

గాండ్లపెంట: మండల విద్యుత్తు ఏఈగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గోర్లంట్ల నుంచి బదిలీపై గాండ్లపెంటకు వచ్చినట్లు తెలిపారు. మండల ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండి విద్యుత్తు అంతరాయం లేకుండా సరఫరా అందించేలా కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ధర్మవరం పట్టణం: చిన్న వయసులోనే దేశభక్తిని అలవరచుకుని నిండు యవ్వనంలో దేశ స్వాతంత్ర్యం, నవ సమాజం కోసం పోరాడిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ భగత్‌సింగ్ అని పీడీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు సందేశ్ పేర్కొన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలను పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కుమ్మరపేటలో తాగునీటి కష్టాలు

తలుపుల: తలుపుల మేజర్ పంచాయతీ కుమ్మరపేటకు చెందిన మహిళలు శనివారం ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. పదిహేనురోజులుగా కాలనీకి తాగునీరు సరఫరా కాలేదని వాపోయారు. దీంతో వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ పగిలిపోవడంతో సరఫరాలో జాప్యం జరిగిందని, మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

లేఅవుట్ల బాధితులకు న్యాయం చేయకుంటే చర్యలు

కదిరి: అనధికార లేఅవుట్లలో ప్లాట్లను కొని ఇబ్బంది పడుతున్న బాధితులకు న్యాయం జరిగేలా క్రమబద్ధీకరించుకోకపోతే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. ముత్యాలచెరువు పంచాయతీ పరిధిలో నాలుగెకరాల్లో లేఅవుట్లు వేసి స్థలాలు విక్రయించారన్నారు. అనుమతులేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలుదారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తేవటంతో ఆయన స్పందించారు. పోషించే నిబంధనల మేరకు లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. అంతేగాకుండా మిషన్ చర్చిల ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్ల సమస్యను వదలబోమని హెచ్చరించారు. కదిరికి చెందిన కొందరు చర్చిల ఆస్తుల సంబంధించిన నమోదైన కేసులకు సంబంధించి ప్రస్తావించారు. అక్రమ రిజిస్ట్రేషన్ విషయంలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే తదితర వ్యక్తులెవరైనా వదిలేసే ప్రసక్తే లేదన్నారు.

చితికిన బతుకులు.. కష్టాల్లో కూలీలు

■ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు


లేవలేని స్థితిలో బట్రేపల్లికి చెందిన అనూష

కదిరి, పుట్టపర్తి, ధర్మవరం పట్టణం, తలుపుల, న్యూస్‌టుడే: కాయకష్టంతో బతికే పేద కుటుంబాలు.. కూలికెళితేగానీ పూట గడవని పరిస్థితులు. ఏ ఎక్కడ దొరికినా పొట్టచేతపట్టుకొని వెళ్లాల్సిందే. కూలీ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతూ రోడ్డు ప్రమాదాలకు గురై కొందరు అవయవాలు దెబ్బతిని వైకల్యం, మరికొందరు కుటుంబ సభ్యులను కోల్పోయి కష్టాల్లో కూరుకుపోయారు. కొందరు ప్రాణాలతో బయటపడినా.. వైకల్యంతో అవస్థలు పడుతున్నారు. ఆగస్టులో జరిగిన ప్రమాదంలో తలుపుల మండలం బట్రేపల్లికి చెందిన ఇద్దరు కూలీలు మృతి చెందారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురికి కాళ్లు, చేతులు, ఇతర అవయవాలు దెబ్బతిని వైకల్యంతో మంచం పట్టారు. నల్లమాడ మండలం దొన్నికోట కూలీలు టమోటా లారీకి వెళ్లి ప్రమాదానికి గురై భర్త మృతి, భార్య మంచం పట్టింది. వీరిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల జీవనం దయనీయంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

మంచానికి పరిమితమై..

తలుపుల మండలం బట్రేపల్లికి చెందిన అనూష ఆగస్టు 2న కూలీ పనులకు ఆటోలో పులివెందులకు వెళ్తూ ప్రమాదానికి గురైంది. కాలు మూడుచోట్ల విరిగి, వెన్నుపూస దెబ్బతింది. ఫలితంగా మంచం పైనుంచి లేవలేని స్థితికి చేరింది. ఈమెకు ముగ్గురు పిల్లలు. వీరంతా ఎనిమిది లోపు తరగతి లోపు చదివే పిల్లలే. వీరికి ఎకరం పొలం ఉన్నా వర్షాధారం సాగు పండక కూలీతో జీవనం సాగిస్తున్నారు. భర్త ఒక్కడి కష్టంతో కుటుంబ గడవటం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి అవకాశం కల్పించేలా ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు.

భర్త దూరమై.. జీవనం భారమై..

తొడిమర్రికి చెందిన శ్రీరాములు డీ.హీరేహళ్‌లో సంక్షేమ వసతి గృహంలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తుండేవారు. వంట సామగ్రి కోసం దుకాణానికి వెళ్లి వస్తుండగా బస్సు ఢీకొనటంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఇతనికి భార్యతో పాటు చదువుకుంటున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు ప్రయోజకులు కాకనే కుటుంబ పెద్ద మృతిచెందారు. ఆ కుటుంబ సభ్యులు అనాథలుగా మారారు. ప్రభుత్వం దయతో ఉపాధి చూపితే జీవనాధారం కలుగుతుందని కుటుంబం వేడుకుంటోంది.


తల్లి లక్ష్మీదేవికి సపర్యలు చేస్తున్న కుమార్తె

కుటుంబం అతలాకుతలమై..

నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన గంగాధర్, లక్ష్మీదేవి దంపతులు దినకూలీలు. ఈనెల మొదటి వారంలో అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు టమోటా లోడు చేయడానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. భర్త మృతిచెందగా లక్ష్మీదేవి తలకు తీవ్రమైన గాయం కావటంతో ఆపరేషన్ చేశారు. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయింది. ఆధారమైన తండ్రి మృతి చెందడం, తల్లి మతిస్థిమితం కోల్పోవడంతో కుమార్తె అఖిల సపర్యలు చేస్తోంది. ఆ అమ్మాయి ఇంటర్ చదువుకు ఆటంకం ఏర్పడింది. కుటుంబాన్ని ఆదుకోవాలని బాలిక కోరుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య: తాడిమర్రి నుంచి మద్దెలచెరువు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - గ్రామస్థులు


కంపచెట్లతో నిండిన మద్దెలచెరువు రహదారి

సమస్య: బీసీ కాలనీలోకి వెళ్లేదారిలోని వీధిదీపం వెలగడం లేదు. దీంతో రాత్రి అయితే కాలనీ మొత్తం చీకటిమయంగా ఉంటోంది. - కాలనీవాసులు

సమస్య: గ్రామానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ డ్రైనేజీ కాలువలో ఉంది. దీనిపై చెత్తచెదారం వేయడంతో పైపులైన్ మునిపోతేంది. - గ్రామస్థులు

సమాధానం: మద్దెలచెరువు రహదారికి అడ్డుగా ఉన్న కంపచెట్లను కార్మికుల సహాయంతో తొలగించి, రాకపోకలకు సమస్యలు లేకుండా చూస్తాం. కాలువలోని చెత్తను తొలగించి, బీసీ కాలనీలో మరమ్మతులకు గురైన వీధి దీపాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తాం.

(పై సమస్యలకు పంచాయతీ కార్యదర్శి రిజ్వాన్‌బేగం సమాధానాలిచ్చారు.)

- న్యూస్‌టుడే, తాడిమర్రి

వరద బాధితులకు ఆర్థిక సాయం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: వరద బాధితులకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీనారాయణ రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి శనివారం అందించారు. అలాగే సిల్వర్‌లైన్ ఇంగ్లిష్ మీడియం ప్రైమరీ పాఠశాల తరపున రూ.20 వేల చెక్కును హెచ్ఎం షకీరా ఖాజా ఎమ్మెల్యేకు అందించారు.

నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: నిరుపేదలందరికీ సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని ఎన్టీకాలనీలో "మన ఇల్లు.. మన గౌరవం" కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారులతో కలిసి లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సదస్సులో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

సిమెంటు ఉచిత రవాణాకు కృషి : కందికుంట

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు నిర్మించుకునే పేదలకు సిమెంటు రవాణాను ఉచితం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణ పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాల లబ్ధిదారులతో మన ఇల్లు, మన గౌరవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇసుక సైతం అందుబాటులో ఉండేలా చేస్తామని, ప్రభుత్వం నిర్ణయించిన 2025 మార్చి నాటికి లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లలో చోటుచేసుకున్న అక్రమాలపై 15 రోజుల్లో సమావేశం జరిపి నిగ్గు తేల్చాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, హౌసింగ్ అధికారులు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

జిల్లాస్థాయి పోటీలకు ప్రతిభావంతుల ఎంపిక

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీఈటీలు తెలిపారు. శనివారం బాలుర క్రీడా పోటీలను సీఐ ఇందిర ప్రారంభించారు. బాలుర అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, అథ్లెటిక్స్‌లో హోరాహోరీగా పోటీలు జరిగాయి. 30 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీఈటీలు వెంకటేశు, ప్రభాకర్, రామకృష్ణ, నాగరాజు, రమేష్, ఓబిలేశు, సూరి, ఉష, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన బాలురతో పీఈటీలు

నల్లచెరువు (కదిరి): నల్లచెరువు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సుజైన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పీడీలు షఫీ, సంధ్యలు తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో వారిని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

● జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలకు కదిరి బాలికల ఉన్నత పాఠశాల నుంచి 12 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం తెలిపారు. కబడ్డీకి అర్చన, దివ్య, ఖోఖోలో సాయిప్రియ, భవిత, భవ్య, స్నేహ, వాలీబాల్‌కు సమీర, స్వప్న, యోగాలో లావణ్య, సింధు, దామిని, షాట్‌పుట్‌కు మోక్షితలు ఎంపికైనట్లు వివరించారు.

కనగానపల్లి: జిల్లా స్థాయి పోటీలకు కనగానపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ రమేశ్ పేర్కొన్నారు. శనివారం అభినందించారు. రామగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి క్రీడలు యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను రెండు రోజుల క్రితం నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగంలో స్నేహ, అండర్-17 బాలుర విభాగంలో హర్షవర్ధన్, రాహుల్, మధు, ప్రవీణ్‌లను ఎంపిక చేశారన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన సునీల్ కుమార్ (20) అనంతపురం పట్టణంలో ఓ టీ దుకాణంలో పని చేసేవాడు. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. అప్పటి నుంచి విచిత్రంగా ప్రవర్తించేవాడు. ఎనిమిదేళ్ల క్రితం తన తల్లి గంగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి సొంత గ్రామం వదిలిపెట్టి పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకునేవాడు. ఈ నెల 27న అనంతపురం పట్టణం నుంచి సొంత గ్రామానికి వచ్చాడు. తన తండ్రి సుబ్బరాయుడు శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆ యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అత్తింటి వారి వేధింపులపై కేసు

కదిరి పట్టణం: భర్త, అత్తింటివారు వేధిస్తున్నారంటూ నంబులపూలకుంట మండలం రామాపురం గ్రామానికి చెందిన వివాహిత సరళ ఫిర్యాదు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భర్త వేణుగోపాల్, అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్యాలయంలో టీవీ చోరీ

అమడగూరు, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం రాత్రి రూ.40 వేలు విలువ చేసే 43 ఇంచుల ఎల్ఈడీ టీవీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఏవో వెంకటరమణాచారి శనివారం తెలిపారు. కార్యాలయ గోదాములో ఏర్పాటు చేసిన టీవీని షట్టర్ తాళం పగులగొట్టి ఎత్తుకెళ్లారు. చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనే జరిగినట్లు వివరించారు.

రాష్ట్ర హాకీ జట్టుకు బాలికలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: హాకీ ఇండియా ఆధ్వర్యంలో జరిగే 14వ జాతీయస్థాయి జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పావని, పవిత్ర, సింధులు ఎంపికైనట్లు ఏపీ హాకీ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు జార్ఖండ్ రాజధాని రాంచిలో జూనియర్ హాకీ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే హాకీ రాష్ట్ర జట్టుకు పట్టణానికి చెందిన హస్సేన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులు, కోచ్‌లను జిల్లా హాకీ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు రామచంద్ర, గౌరీ ప్రసాద్, మహమ్మద్ అస్లాం, రాఘవేంద్ర అభినందనలు తెలిపారు.


శిక్షకుడు హస్సేన్‌తో హాకీ రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

గొడవల జోలికెళితే కఠిన చర్యలు: ఎస్పీ

బత్తలపల్లి, న్యూస్‌టుడే: బత్తలపల్లి సర్కిల్ పోలీసుస్టేషన్‌ను ఎస్పీ రత్న శనివారం తనిఖీ చేశారు. పెండింగ్ రికార్డులను పరిశీలించారు. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా కానిస్టేబుళ్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో గొడవలు జరగకుండా గ్రామసభలు నిర్వహించాలని, రౌడీషీటర్లు, అనవసరంగా గొడవలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

మైనాస్వామికి పర్యాటక ఉత్తమ ప్రచార అవార్డు

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన చరిత్రకారుడు మైనాస్వామికి ఆర్కిటెక్చర్ అండ్ ఆర్ట్ ఆఫ్ విజయనగర లేపాక్షి పేరున వెలువడిన ఆంగ్ల పుస్తకానికి ఉత్తమ ప్రచార అవార్డు దక్కింది. అవార్డును విజయవాడలో అందుకున్నట్లు ఆయన 'న్యూస్‌టుడే'కి చెప్పారు. విజయనగర సామ్రాజ్య సంస్కృతి వైభవానికి ప్రతీకగా లేపాక్షి పుస్తకం మొదట తెలుగులో, ప్రజల నుంచి ఆదరణ లభించడంతో అనంతరం కన్నడ, ఆంగ్లంలో పుస్తకాన్ని గతేడాది ప్రజల ముందుకు తెచ్చామన్నారు. కన్నడ పుస్తకాన్ని బెంగళూరు, ఆంగ్ల పుస్తకం దిల్లీలో విడుదల చేశామన్నారు. ఆంగ్లంలో ప్రచురించబడిన లేపాక్షి పుస్తకం ప్రత్యేకత, విశిష్టతను గుర్తించిన పర్యాటకశాఖ అవార్డు అందజేసిందని వివరించారు.



అవార్డు అందుకుంటున్న మైనాస్వామి

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని ధూపంపల్లి సమీపంలో కొద్దిరోజులుగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో శనివారం ఎస్సై కృష్ణమూర్తి ప్రత్యేక బృందంతో కలిసి తనిఖీ చేశారు. గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులతో పాటు పది ద్విచక్ర వాహనాలు, రూ.20వేల నగదు, ఐదు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం నల్లగుట్టవీధిలో నివాసం ఉంటున్న ప్రభావతి (26) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. కర్ణాటకకు చెందిన ప్రభావతి, రంజిత్‌కుమార్ దంపతులు ఉపాధి కోసం కదిరికి వలస వచ్చారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసే రంజిత్‌కుమార్ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. శుక్రవారం రాత్రి దంపతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మనస్తాపానికి గురైన ప్రభావతి పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గుర్తించిన భర్త ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పల్లె విద్యార్థులు.. ఆటల్లో ఆణిముత్యాలు


ముదిగుబ్బలో షూటింగ్‌బాల్‌పై శిక్షణ ఇస్తున్న పీడీ రేఖ

ముదిగుబ్బ, ధర్మవరం పట్టణం, బత్తలపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే తపన, పట్టుదలతో శ్రమించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడా ప్రతిభ చాటాలని నిత్యం కఠోర సాధన చేస్తున్నారు. ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో జూడో, షూటింగ్‌బాల్, జూనియర్స్ బ్యాడ్మింటన్ క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల వివరాలు వారిమాటల్లోనే..

జాతీయ స్థాయి క్రీడల్లో రాణింపు

ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యం



ధర్మవరంలోని కొత్తపేట మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాను. స్వగ్రామం ధర్మవరం. నాన్న పెద్దన్న బేల్దారి, అమ్మ నాగవేణి గృహిణి. మహిళల ఆత్మరక్షణ కోసం జూడో నేర్చుకున్నాను. ఇందులో రాణిస్తుండటంతో కోచ్ ఇనాయత్‌బాషా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. గతేడాది రాష్ట్రస్థాయి క్రీడల్లో 30 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాను. ఈనెల 9వ తేదీన చెన్నైలో జరిగిన సౌత్ జోన్ జూడో పోటీల్లో 28 కేజీల విభాగంలో వెండి పతకం సాధించాను. ఈనెల 22, 23, 24 తేదీల్లో కేరళలోని త్రిశూర్‌లో జరిగిన -28 కేజీల విభాగంలో వెండి పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో పాల్గొనాలని, నాన్న ఆశయాల మేరకు ఏఏఎస్ కావాలని ఉంది. **- యువ సంధ్య**

కలెక్టర్ కావాలనుంది..



ముదిగుబ్బ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాను. ఈదులపల్లి స్వగ్రామం. అమ్మానాన్న పెద్దఓబిలేసు, మహాలక్ష్మి. మాది వ్యవసాయ కుటుంబం. వ్యాయామ ఉపాధ్యాయురాలు రేఖ శిక్షణతో అండర్-17 విభాగం జిల్లాస్థాయి షూటింగ్‌బాల్‌లో రాణించడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. అక్టోబరులో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ క్రీడల్లో సత్తా చాటేందుకు సాధన చేస్తున్నాను. భవిష్యత్తులో కలెక్టర్ కావడమే నా లక్ష్యం. **- అహల్య**

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా



బత్తలపల్లిలోని రామాపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. మాది రామాపురం. నాన్న ఇబ్రహీం మెకానిక్‌గా పనిచేస్తున్నారు. అమ్మ షకీన గృహిణి. ఇటీవల అండర్-18 విభాగంలో జిల్లాస్థాయిలో జూనియర్స్ బ్యాడ్మింటన్‌లో రాణించాను. అక్టోబరు 5, 6, 7వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాను. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతాను. **- ఇబ్రహీం**

సీఐ మృతికి సంతాపం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న అర్జున్‌నాయక్ (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ. ఈ మేరకు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. సీఐ మృతికి జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ నివాళులర్పించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రామగిరిలో ఏర్పాటు చేసిన ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్య శిక్షణ కేంద్రం మేనేజరు నాగేంద్ర తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 10 వరకూ ఉచిత శిక్షణకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. 5జీ నెట్‌వర్క్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, ఎంఎస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లీషు తదితర కోర్సులను 4 నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్‌తోపాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు 7981960411, 7386143423 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

రూ.50 లక్షల గోదాం..
నిర్వహణ లేక నిరుపయోగం

ధర్మవరం పట్టణం, ధర్మవరం, న్యూస్‌టుడే: రూ.50 లక్షల నిధులతో పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను అధికారులు వృథాగా వదిలేశారు. దీంతో ఆ గోదాం చుట్టూ కంపచెట్లు పెరిగిపోయి అధ్వానంగా మారింది. నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో ప్రభుత్వ రేషన్ దుకాణాలకు ప్రతినెలా సరఫరా చేసే బియ్యం, చక్కెర, కందిపప్పు తదితర సరకులను నిల్వ చేసుకునేందుకు పట్టణ సమీపంలోని గుట్టకిందపల్లి వద్ద గోదాం నిర్మించారు. 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలో దీన్ని ప్రారంభించి రేషన్ సరకులను నిల్వ చేసేవారు. మూడునాలుగేళ్లపాటు ఇక్కడి నుంచే సరకులను పంపిణీ చేపట్టారు. ఆ తరువాత భారీగా వర్షం కురవడంతో గోదాము చుట్టూ నీరు చేరడంతో దాన్ని మూసివేశారు. పట్టణంలోని ఇళ్ల వ్యర్థాలను గోదాం చుట్టూ పడవేయడంతో గుట్ట, గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో గోదామును పట్టణంలోని మార్కెట్‌యార్డులో కార్యాలయంలోకి మార్చారు. కానీ అందులోని వస్తువులను అలాగే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో విలువైన వస్తు సామగ్రి తుప్పుపడుతోంది. సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. లక్షల ప్రజాధనం ఖర్చుచేసి నిర్మించిన గోదామును ఇలా వృథాగా వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి. సంబంధిత శాఖాధికారులు వెంటనే దీనిపై స్పందించాలని పలువురు కోరుతున్నారు. ● ఈ విషయంపై ధర్మవరం పౌరసరఫరాలశాఖ అధికారి లక్ష్మీదేవిని వివరణ కోరగా ఈ విషయం తనకు తెలియదని, దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి ఏం చేయాలో నిర్ణయించుకుంటామని తెలిపారు.


పౌర సరఫరాల గోదాం చుట్టూ పెరిగిన ముళ్లకంపలు